



జనసేనకు.. పండుగ



నేడే జనసేన ఆవిర్భావ దినోత్సవం

(కాకినాడ/ పిఠాపురం -ఆంధ్రజ్యోతి)

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ జరిగే చిత్రాడ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతోన్న తొలి ఆవిర్భావ సభకు పిఠాపురం మండలం వేదికగా మారడంతో అంతా పండగ వాతావరణం తలపిస్తోంది. శుక్రవారం జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ సభకు కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ భారీ ఏర్పాట్లతో సిద్ధమైంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది తరలి రానున్న సభను జయప్రదం చేయడానికి జనసేన పార్టీ ఎక్కడికక్కడ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ 'జయకేతనం' సభ దద్దరిల్లేలా ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో సన్నాహాలు చేసింది.

అదిరే..ఆతిథ్యం

ఆవిర్భావ సభకు వచ్చే జనసేన నాయకులు, అభిమానులు భోజనాలు, తాగునీరు, స్నాక్స్ కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో విస్తృత ఏర్పాట్లుచేశారు. శుక్రవారం మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా భోజన సదుపాయాలతోపాటు సభా ప్రాంగణంలో నిరంతరాయంగా తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, పుచ్చకాయలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ధర్మవరం కోల్డ్‌స్టోరేజీ, యానాం రోడ్డు, అన్నవరం వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ భోజన కౌంటర్ల పర్యవేక్షణ బాధ్యతలను ఎమ్మెల్యేలకు అప్పగించారు. 20కిపైగా అంబులెన్స్‌లు, ఐదు వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు. గురువారం మధ్యాహ్నానికే చిత్రాడకు వందలాదిమంది తరలివచ్చారు. వీరందరికి ఇక్కడే భోజన సదుపాయం కల్పించారు.

డ్రోన్లు..సీసీ కెమెరాలు..

సభను నేరుగా చూసే అవకాశం లేని వారి కోసం సభా ప్రాంగణంలో 20కిపైగా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. సభా ప్రాంగణం బయట జాతీయ రహదారిపై ఉండిపోయే వారి కోసం కూడా ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటుచేశారు. ప్రత్యేక సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ చిక్కులు లేకుండా చేసేందుకు సీసీ కెమేరాలతోపాటు డ్రోన్లతో పోలీసు శాఖ నిఘా ఉంచబోతోంది. సభా ప్రాంగణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. 10 నుంచి 15 డ్రోన్లతో సభా ప్రాంగణం, జాతీయ రహదారి, సభకు వచ్చే అన్ని మార్గాల్లో నిఘా ఏర్పాటు చేశారు. వాటిని నిరంతరాయం గమనించేందుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. బందోబస్తుకు 1700 మందికి పైగా పోలీసులను ఏలూరు రేంజ్ పరిధిలోని ఆయా స్టేషన్ల నుంచి రప్పించారు. వీరు గురువారం సాయంత్రానికే చిత్రాడ చేరుకున్నారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాహన పార్కింగ్ ఇలా..

వాహనాల పార్కింగ్‌కు తొమ్మిది ప్రాంతాలు ఏర్పాటుచేశారు. కాకినాడ వైపు ఐదు, పిఠాపురం వైపు నాలుగు పార్కింగ్ ప్లేసులు గుర్తించారు. 216వ జాతీయరహదారిపై కాకినాడ-కత్తిపూడి మధ్య ఆవిర్భావ సభకు వచ్చే వాహనాలు తప్ప మిగిలిన వాటి రాకపోకలను ప్రత్యామ్నాయ రహదారులపై మళ్లించారు. ఆర్టీసీ బస్సులు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ ఈ మార్గంలో కాకుండా ఇతర మార్గాల్లో తిరిగేవిధంగా ఆయా మార్గాలను సూచించారు.


రహదారుల్లో జనసేన సందడి

- ఒక రోజు ముందే పండగ
- చిత్రాడలో సభకు భారీ ఏర్పాట్లు
- లక్షల మంది వస్తారని అంచనా
- ఎకరం విస్తీర్ణంలో సభావేదిక
- 7 గ్యాలరీలు.. 3 మార్గాలు
- తొమ్మిది పార్కింగ్ ప్రదేశాలు
- భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు
- 'థాంక్యూ పిఠాపురం' నినాదం
- మధ్యాహ్నం 3 నుంచి సభ
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు
- 1700 మందితో బందోబస్తు

2 గంటలపాటు పవన్ ప్రసంగం

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేరుగా అమరావతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు చిత్రాడ సభా ప్రాంగణం సమీపంలోని హెలీప్యాడ్‌లో దిగనున్నారు. సభా వేదికకు 500 మీటర్ల దూరంలోనే హెలిప్యాడ్‌ను నిర్మించారు. పవన్ దాదాపు రెండు గంటలకుపైగా ప్రసంగించే అవకాశం ఉంది. ఎన్నో మరపురాని జ్ఞాపకాలు ఇచ్చిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు నిండు మనసుతో కృతజ్ఞతలు తెలిపేందుకు థాంక్యూ పిఠాపురం చెప్పుకుందాం! అనే నినాదంతో ఈ సభ జరగనున్నది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సభా కార్యక్రమాలు ప్రారంభమై రాత్రి పది వరకు జరుగుతాయి. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు, ఆడియో, వీడియో ప్రజెంటేషన్లు, ముఖ్య నేతల ప్రసంగాలు, చివరగా పవన్ ప్రసంగం ఉంటాయి.

24 ఎకరాల విస్తీర్ణంలో సభ



చిత్రాడ శివారు 24 ఎకరాల విస్తీర్ణంలో జనసేన ఆవిర్భావ సభ జయకేతనం నిర్వహిస్తున్నారు. 14 ఎకరాల విస్తీర్ణంలో ఏడు గ్యాలరీలు ఏర్పాటుచేసి రెండు మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. అంతకంటే అధికంగా వచ్చేవారు నిల్చుని సభా కార్యక్రమాలను వీక్షించేందుకు వీలుగా సభా వేదికను నిర్మించారు. మూడు అంచెల్లో నిర్మించిన సభావేదిక మొదటి వరుసలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పార్టీ ఎం పీలు, ఎమ్మెల్యేలు ఆసీనులు కానున్నారు. మి గిలిన రెండు వరుసల్లో సుమారు 250 మంది ఆహ్వానితులు కూర్చునే విధంగా ఏర్పాట్లుచేశారు. సభావేదిక వెనుక భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సభ చివర స్థానంలో కూర్చున్న వారికి కూడా పసంగాలు వినిపించేలా.. ఏర్పాట్లు చేశారు. అధునాతనంగా అందుబాటులోకి వచ్చిన లైటింగ్ సిస్టంను వినియోగించారు.

"ప్రతిరోజూ నేను స్వయంగా ఇక్కడకు రాలేకున్నా నా మనసంతా ఇక్కడే ఉంటుంది.. నేను నోటితో చెప్పను.. పనులు చేసుకుంటూ వెళ్తా.. నా కళ్లు, చెవులు మీరే.. ఏ సమస్యనైనా నా దృష్టికి తీసుకు రండి.. పరిష్కరించేందుకు కృషి చేస్తా. ప్రత్యేకంగా అధికారులను పంపి ఇక్కడి సమస్యలు, ప్రజల ఇబ్బందులను తెలుసుకుంటున్నా" పిఠాపురం నుంచి ఎన్నికైన తరువాత డిప్యూటీ సీఎం పవన్‌చెప్పిన మాటలు ఇవి. ఆచరణలో వీటిని సాధించి చూపిస్తున్నారు.

- అభివృద్ధి దిశగా పిఠాపురం
- హామీల అమలులో ముందు
- మోడల్‌గా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం పవన్ కృషి

నడిపించే.. నాయకుడొచ్చాడు!

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు పిఠాపురం.. నేడు పిఠాపురం వేరు.. పవన్ అన్నొచ్చాడు.. పనులు చేస్తున్నాడు.. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. పల్లెలు, పట్టణాల్లో అధ్వానంగా ఉన్న రహదారులకు మోక్షం లభించింది. కోట్లాది రూపాయలతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. 9 నెలల్లోనే ప్రతి అంశంలోనూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనదైన ముద్రను బలంగా వేశారు.దేశంలోనే పిఠాపురం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది అందరిచూపూ ఇటువైపు ఉండేలా చూస్తానన్న పవన్‌కల్యాణ్ అందుకు తగ్గట్టుగా అడుగులు వేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటుచేసిన పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ద్వారా అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయించే ప్రక్రియ కొనసాగుతోంది. విజన్-2029 ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ను ఇప్పటికే శాఖల వారీగా తయారుచేశారు. నాలుగేళ్లపాటు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయిస్తారు. పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి)ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.38 కోట్లతో ఆసుపత్రి అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న వైద్యులకు అదనంగా 23 మంది స్పెషలిస్టు వైద్యులు సహా 69 మంది అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించనున్నారు.

9 నెలలు.. అభివృద్ధి ఇలా..

- సుద్దగడ్డ కాలువపై రూ.4 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. రూ.1.35 కోట్లతో పశువుల సంత ఆధునికీకరణ.
- ఉపాధి హామీ ద్వారా నియోజకవర్గంలో రోడ్ల పనులు చేస్తున్నారు. రూ.6 కోట్లతో కాంపౌండ్ వాల్స్ నిర్మించనున్నారు. గొల్లప్రోలు, వన్నెపూడిల్లో ఎస్సీ శ్మశాన వాటికల మార్గాలకు ప్రత్యేకంగా భూసేకరణకు నిధులు కేటాయించారు.
- పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధునీకరణకు రూ. 1.75 కోట్లు మంజూరు చేయించారు. 32 ఉన్నత పాఠశాలలకు రూ.16 లక్షలతో 64 క్రీడాకిట్లు అందజేశారు. 33 జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, వసతి గృహాల్లో వసతుల కల్పనకు రూ.3 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తిచేశారు.
- పిఠాపురం పాదగయ క్షేత్రం చెంతన రూ.కోటితో నగర వనం ఏర్పాటుకు శ్రీకారం
- పిఠాపురంలోని టీటీడీ కల్యాణ మండపం ఆధునికీకరణకు రూ.73 లక్షలు, వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మాడవీధుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరుచేసి పనులకు పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం.
- గొల్లప్రోలులో రూ.44 లక్షలతో తహశీల్దార్ కార్యాలయం, అర్బన్ హెల్త్ సెంటర్ భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభించాల్సి ఉంది.
- పట్టు రైతులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయించి.. పరిహారం మంజూరు చేయించారు. గొల్లప్రోలు నుంచి సూరంపేట వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి రూ.26 లక్షలు కేటాయించారు.గొల్లప్రోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.78 లక్షలతో పనులు నిర్వహించారు. ఇవేగాక నిధులివ్వడంతో పలు పనులు జరుగుతున్నాయి.

రేపు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం : కలెక్టర్ మహేష్‌కుమార్ 7

రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (శుక్ర)	సా.6.21
	సహరి (శని)	ఉ.4.50

ఆవిర్భావ సభకు పటిష్ట బందోబస్తు


జనసేన ఆవిర్భావ సభ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బిందుమాధవ్

» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

పిఠాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీ ఆవిర్భావ సభకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారులోని ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో శుక్రవారం జరిగే ఆవిర్భావసభవద్ద భద్రతా ఏర్పాట్లను గురువారం రాత్రి ఆయన జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి పరిశీలించారు. సభాప్రాంగణం, వేదిక, హెలిప్యాడ్ తదితరాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.సభా ప్రాంగణంతోపాటు సభకు వచ్చే మార్గాల్లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాహనాలను నిర్ధేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేసేలా చూడాలని చెప్పారు. అనంతరం ఆవిర్భావ సభ బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల నుంచి పోలీసు అధికారులు, పోలీసులకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్పీలు భాస్కరరావు, సత్యనారాయణ, కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఉన్నారు.

ఎమ్మెల్సీ నాగబాబు సమక్షంలో జనసేనలోకి చేరికలు


పార్టీ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

గొల్లప్రోలురూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో గురువారం రాత్రి పలువురు వైసీపీ నేతలు జనసేనలో చేరారు. పిఠాపురం మునిసిపల్ కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరీ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు(అయలు), దుర్గాడ న్యాయవాది ఇంటి సర్వారాయుడు(బాబు) సహా 31మంది జనసేనలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ పటిష్టతకోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆవిర్భావసభ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు, గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాసేవకు పునరంకితం అవుతాం

» పిఠాపురం ప్రజలకు నిండు మనస్సుతో కృతజ్ఞతలు
» ఆవిర్భావ సభకు మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతున్నాం
» రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్


పిఠాపురం మండలం చిత్రాడ ఆవిర్భావ సభ వేదిక జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, చిత్రంలో మంత్రి దుర్గేష్, ఎంపీ ఉదయశ్రీనివాస్ తదితరులు

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభ ద్వారా ప్రజాసేవకు పునరంకితం కావడంతోపాటు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను నిండు మనసుతో ఆశీర్వదించిన పిఠాపురం ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తామని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడజిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో జరిగే జనసేన ఆవిర్భావ సభ వేదికవద్ద గురువారం రాత్రి రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దేశచరిత్రలోనే తొలిసారిగా..

11ఏళ్లపాటునిస్వార్థమైన పవన్‌కల్యాణ్ రాజకీయ ప్రస్థానంతో ఈ రోజున అధికారంలోకి భాగస్వాములుగా ఉన్నామని జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. దేశచరిత్రలోనే తొలిసారిగా పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలన్నింటిలో విజయం సాధించి చరిత్ర సృష్టించామన్నారు. ఈ విజయం ప్రజలకోసమని, వారు ఏ విధంగా తమపై నమ్మకంతో గెలిపించారో దాన్ని నిలబెట్టుకుంటూ ఈ సభ ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా కృషిచేస్తామని చెప్పారు. జనసేన పోరాటంలో పవన్‌కల్యాణ్‌తో నిలబడిన జనసైనికులు, వీరమహిళలను ఆవిర్భావ సభలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. సభ విజయవంతం చేసేందుకు 14 కమిటీలు ఏర్పాటు చేసి 450 మందిని సభ్యులుగా నియమించామని చెప్పారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంనుంచే ఆహ్వాన కమిటీలో 250మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. సభకు వచ్చిన ప్రతిఒక్కరినీ అతిథులుగా ఆదరించి గౌరవిస్తామని, వారు తిరిగి వెళ్లే సమయంలో నాలుగు ప్రధాన రహదారులపై ఎంపీలు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. జనసేన పార్టీని ఒక నమ్మకంతో ప్రజలు గెలిపించారని, తమ జీవితాల్లో మార్పులు వస్తాయని వారు భావించారని మంత్రి తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా అభివృద్ధి చేసి చూపించడంతోపాటు సంక్షేమాన్ని ప్రతి కుటుంబానికి చేరుస్తామని చెప్పారు.

మధ్యాహ్నమే సభ ప్రారంభం

జనసేన పార్టీ ఆవిర్భావ సభ కార్యక్రమాలు మధ్యాహ్నం 3.30గంటలకు ప్రారంభమవుతాయని మంత్రి నాదెండ్ల తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా ఒక మత్స్యకార ప్రతినిధి, పవన్‌కల్యాణ్ పర్యటించిన ఏజెన్సీ గ్రామాల ప్రతినిధిలో రోడ్ల నిర్మాణంతో వారి జీవితాల్లో వచ్చిన మార్పులు, యువత ద్వారా జనసేన నుంచి ఏం ఆశిస్తున్నారు, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి తదితర అంశాలపై అభిప్రాయాలతో ప్రసంగాలు ఉంటాయని వివరించారు.

అభివృద్ధి గురించి వివరిస్తాం

పిఠాపురం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజంటేషన్, కాకినాడ జిల్లాతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం కేంద్రంగా టెంపుల్ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని పవన్ చెప్పిన దానికి అనుగుణంగా తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తామన్నారు. రాజకీయ నాయకుల ప్రసంగాలతోపాటు చివరిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రసంగం ఉంటుందని చెప్పారు. పలు ఆడియో, వీడియో ప్రజంటేషన్లు ఉంటాయని చెప్పారు. సభా ప్రవేశమార్గాలకు డొక్కా సీతమ్మ, సత్యలింగనాయకర్, పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్‌ల పేర్లను పెట్టినట్లు తెలిపారు. రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా సమాజం,రాష్ట్రం, దేశంకోసం పునరంకితమయ్యే దిశగా సభ ఉంటుందని చెప్పారు. తమకు గతంలో జరిగిన అవమానాలు, ఇబ్బందుల గురించి కాకుండా ప్రజలకోసం రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసమే ఆలోచిస్తామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో కుడా చైర్మన్ తుమ్మల బాబు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జనసేన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు.. కాకినాడ జిల్లాలో

పవన్ పర్యటన

» జనసేన ఆవిర్భావ సభలో పాల్గొననున్న డిప్యూటీ సీఎం


చిత్రాడవద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్

పిఠాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్ర, శనివారాల్లో కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పాల్గొననున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 14వతేదీ ఉదయం 9.35గంటలకు హైదరాబాద్ మాదాపూర్‌లోని నివాసంనుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి 10గంటలకుబయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు 10.40గంటలకు చేరుకుని, అక్కడినుంచి మంగళగిరి క్యాంప్ ఆఫీసుకు వెళ్తారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం హెలీపాడ్‌నుంచి మధ్యాహ్నం 3గంటలకు బయలుదేరి చిత్రాడవద్ద జరిగే జనసేన ఆవిర్భావసభలోని హెలిపాడ్‌వద్దకు 3.45 గంటలకు చేరుకుంటారు. రాత్రి 7.30గంటల వరకూ ఆవిర్భావ సభలో పాల్గొని చిత్రాడనుంచి బయలుదేరి కాకినాడ జేఎన్‌టీయూ అతిథిగృహానికి చేరుకుని అక్కడ రాత్రిబసచేస్తారు. 15వతేదీ ఉదయం 9.15 గంటలకు అతిథిగృహంనుంచి బయలుదేరి కాకినాడ పోలీసు పెరేడ్‌గ్రౌండ్స్‌నుంచి హెలికాప్టర్‌లో మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

వైభవంగా రంగనాథ కల్యాణం

కోరుకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం రంగనాథ స్వామి ఆలయం వద్ద శ్రీ భూ సమేత రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వైకానస ఆగమ శాస్త్రం ప్రకారం పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో అనువంశిక అర్చకులు పెదపాటి గిరిధరాచార్యులు, వాడపల్లి నాగుఆచార్యులు, గోవర్ధన తిరుమలాచార్యులు మంత్రోచ్చారణల మధ్య వంశ పారంపర్య కల్యాణ దాత గొట్టుముక్కల అన్నమాచార్య కుటుంబ సభ్యులు ఎస్‌టీపీ వెంకటరమణాచార్య స్వామి దంపతులు కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు పాలకొల్లు నుంచి వచ్చిన భక్తులు, వెంకటరమణాచార్య శిష్యులు.. బాదంపాలు, ప్రసాదాలు అందజేశారు. కల్యాణాన్ని జరిపించిన ఆగమ బ్రహ్మలను అనువంశిక ధర్మకర్తలు, శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు పరాసర లక్ష్మీనరసింహభట్టర్, రంగరాజ భట్టర్, రఘునాథ భట్టర్‌లను, అర్చకులను, ఆలయ అధికారులను కల్యాణకర్త దంపతులు సత్కరించారు. పదేళ్లుగా ఈ కల్యాణం నిర్వహిస్తున్న వెంకటరమణాచార్య దంపతులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు అభినందించారు.

గజవాహనంపై నరసన్న గ్రామోత్సవం

నరసన్న కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి లక్ష్మీనరసింహస్వామికి గజవాహనంపై గ్రామోత్సవం చేశారు. దిగువ దేవస్థానం వద్ద సేవాకాలం నిర్వహించి స్వామి వారిని ఆలయ అర్చకులు గజవాహనంపై ఆశీనులను చేశారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల మధ్య గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు ఫల పుష్పాలు, మంగళ నీరాజనాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ నరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి శేషమాల, శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న విశిష్టాద్వైత పండిత సభల్లో రామనుజ ముని జీయర్ స్వామి, ఉభయ వేదాంత పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణామాచార్య స్వామి(భద్రాచలం స్థానాచార్యులు), పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రఘునాథ భట్టర్, స్థలసాయి ఉపన్యసించారు. కల్యాణోత్సవాలకు వచ్చిన భక్తులకు స్థానిక మిరియాల వెంకటరెడ్డి పంతుల ధర్మసత్రంలో ఉదయం, సాయంత్రం అన్నప్రసాదాలు అందజేస్తున్నట్లు సత్రం ఈవో గండి వెంకటలక్ష్మీకుమార్, వి.సూరిబాబు తెలిపారు.


గజవాహనంపై నిర్వహిస్తున్న నరసన్న గ్రామోత్సవం

కాకినాడ జిల్లా పోలీసులకు సీసీ కెమెరాల వితరణ


ఎస్పీ బిందుమాధవ్‌కు సీసీ కెమెరాలు అందిస్తున్న మురళి

కాకినాడ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌లోని సూర్యారావుపేట ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణం మురళి పోలీసు శాఖకు రూ.1.20 లక్షలు విలువైన సీసీ కెమెరాలను అందించారు. గురువారం ఆయన కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, సర్పవరం ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసి సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణకు సీసీ కెమెరాలు పోలీసు శాఖకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు చొరవతో సీసీ కెమెరాలు అందించిన పారిశ్రామికవేత్త మురళిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ ఈడీ ఎన్.శిశిర్, హెచ్‌ఆర్ పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డెల్టా కాలువలకు 9850 క్యూసెక్కులు

ధవళేశ్వరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజీ నుంచి మూడు డెల్టా కాలువలకు 9850క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2950క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1900 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5వేల క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదలవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 10,235క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.10 అడుగులుగా, పాండ్ లెవెల్‌గా 13.75మీటర్లుగా నమోదైంది.

వెంకన్న ఆలయంలో ఎమ్మెల్సీ 'సోము' పూజలు


వెంకన్న ఆలయంలో సోము దంపతులు

ఆత్రేయపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. సోము దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి మృతి

ఆత్రేయపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలిలో ట్రాక్టర్ ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరానికి చెందిన అరుగుల చంద్రరావు(63) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే ఓశుభ కార్యక్రమానికి నడుచుకుంటూవెళ్తున్నాడు. ర్యాలి జిమ్‌సెంటర్‌వద్దకు వచ్చేసరికి క్రిషి ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తవల్ల బలంగా ఢీకొనడంతో చంద్రరావు అక్కడిక్కడే మృతిచెందాడు. దీనిపై మనుమడు చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఏఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీని ఢీకొన్న బైక్

» ఒకే కుటుంబంలోని మామ్మ, మనవడు దుర్మరణం
» తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో ఘటన
» గోపాలపురం గ్రామంలో విషాదఛాయలు




మీరాతున్నీస, సమీర్(పాత చిత్రాలు).. దేవరపల్లి మండలం దుద్దుకూరు సమీపంలో సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దేవరపల్లి/గోపాలపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) భర్తకు గుండె ఆపరేషన్ చేయించి నెల కాకుండానే భార్య, మనవడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం గ్రామానికి చెందిన మామ్మ షేక్ మీరాతున్నీస (50), మనవడు షేక్ సమీర్(17) కీడుబట్టలు కట్టుకోవడానికి గురువారం కొవ్వూరు మండలం పంగిడి సమీపంలోని గోవర్ధనమెట్ట వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి బయల్దేరారు. 1.30గంటల సమయంలో దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామ సమీపంలోకి వచ్చేసరికి జాతీయ రహదారిపై ఎదురుగా వెళ్తున్న లారీడ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక మోటారు సైకిల్‌పై వస్తున్న వీరు లారీని ఢీకొనడంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మీరాతున్నీస చికిత్స పొందుతూ మృతిచెందింది. సమీర్‌ను మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యాధికారులు తెలిపారు. మీరా తున్నీస కుమారుడు షేక్ రియాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతుడు సమీర్(17) స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయసంవత్సరం సీఈసీ చదువుతున్నాడు. తండ్రి రియాజ్ వడ్రంగి పనిచేస్తుంటాడు. ఆయనకు చేదోడుగా ఉంటూ ఖాళీ సమయాలు, సెలవు రోజుల్లో తండ్రితో కలిసి వెళ్తూ పనిలో సాయం చేస్తుంటాడు. గురువారం పరీక్ష లేకపోవడంతో నానమ్మను ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. సమీర్ స్నేహితులు, స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.

కారు ఢీకొని మోటారుసైక్లిస్టు మృతి

ఐ.పోలవరం/ముమ్మిడివరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కొమరగిరి వద్ద గురువారం రాత్రి కారు ఢీకొని ముమ్మిడివరానికి చెందిన వంటపాటి వీరేంద్ర (32) మృతి చెందాడు. యానాం నుంచి మోటారు సైకిలుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ముమ్మిడివరం నగర పంచాయతీ 20వ వార్డు మట్టాడిపాలేనికి చెందిన వంటపాటి రాముడు-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వారిలో పెద్దవాడైన వీరేంద్రకు భార్య నాగవెంకటదుర్గ, ఎనిమిదవ తరగతి చదువుతున్న శ్రీదివ్యలక్ష్మి, ఆరవ తరగతి చదువుతున్న దివ్యశ్రీ ఉన్నారు. భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటోంది. వీరేంద్ర లారీపై జట్టు కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరేంద్ర మృతితో ఆ కుటుంబం ఆదరణ కోల్పోయింది.


వీరేంద్ర (పాత చిత్రం)


హీరో శ్రీకాంత్‌ను ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకస్వామి

అంతర్వేది నరసన్న సన్నిధిలో సినీ హీరో శ్రీకాంత్

అంతర్వేది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, హీరో శ్రీకాంత్ గురువారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు.ప్రదక్షిణ తర్వాత అంతరాలయంలో స్వామివారి దర్శనం చేయించి వేదపండితులు మహదాశీర్వచనం ఇచ్చారు. అర్చకులు ఆయనకు స్వామిచిత్రపటం,ప్రసాదం అందజేశారు.

ఉత్తమ ప్రదర్శనగా 'కనకపుష్యరాగం'

గొల్లప్రోలు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళా వేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక ప్రదర్శన పోటీలు గురువారం ముగిశాయి. విజయవాడ దృశ్య వేదిక కళాకారుల 'కనకపుష్యరాగం' నాటకం ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారుల 'ఇది అతని సంతకం', తృతీయ ప్రదర్శనగా కాకినాడ కార్తికేయ క్రియేషన్స్ కళాకారుల 'ఎడారిలో వాన చినుకు' ఎంపికయ్యాయి. ఉత్తమ దర్శకుడిగా ఎస్కే మిశ్రో (కనకపుష్యరాగం), రచనగా వల్లూరి శివప్రసాద్ (అన్నదాత), ఉత్తమ నటుడిగా దొంతల ప్రకాష్ (కనకపుష్యరాగం), నటిగా జ్యోతి (ఎడారిలో వాన చినుకు), ఉత్తమ ప్రతి నాయకుడిగా కొల్లా రాధాకృష్ణ (అన్నదాత), హాస్య నటుడిగా ఈవన రమేష్‌బాబు (కనకపుష్యరాగం), సహాయ నటుడిగా బి.గణేష్ (ఎడారిలో వాన చినుకు), సహాయ నటిగా జి.నాగకుసుమసాయి (ఇది అతని సంతకం), ఉత్తమ క్యారెక్టర్ నటిగా శోభారాణి (అన్నదాత), క్యారెక్టర్ నటుడిగా రాధాకృష్ణ (ఎడారిలో వాన చినుకు), ఉత్తమ సంగీతం-లీలామోహన్ (ఇది అతని సంగీతం), ఆహార్యం-నాగు (ఎడారిలో వానచినుకు), ఉత్తమ రంగాలంకరణ-శివధామ్ (ఇది అతని సంతకం), జ్యూరీ అవార్డులకు పుష్యమి, కేబీ ఆనంద్ (భౌ..భౌ..భౌ) ఎంపికయ్యారు. విజేతలకు అపర్ణా నాటక కళా పరిషత్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రూ.5వేలు జరిమానా

అమలాపురంటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): అమలాపురం శుభకలశం ఎదురుగా ఉన్న జేఎస్ వైన్స్ మద్యం షాపులో గురువారం సచివాలయ కార్యదర్శులు తనిఖీలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సీజ్‌చేసి రూ.5వేలు జరిమానా విధించారు. కార్యదర్శి బండి వీరన్న, కాండ్రేగుల వెంకట ఈశ్వరరావు పాల్గొన్నారు.

హోలీని ప్రశాంతంగా జరుపుకోవాలి

అమలాపురంటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హోలీని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ బి.కృష్ణారావు కోరారు. జిల్లా ప్రజలందరికీ ఆయన గురువారం హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా హోలీ పండుగ జరుపుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు.

ప్లాస్టిక్ స్థానే జూట్ సంచులు వినియోగించాలి

అమలాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జూట్ సంచులు వినియోగాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులకు సూచించారు. ఈ నెల15న మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహణపై గురువారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల విక్రయదారులను గుర్తించి విక్రయాలు నిలుపుదలచేయాలని, వాటి స్థానంలో డ్వాక్రా సంఘాలు తయారుచేసిన జూట్ బ్యాగులను విక్రయించేలా చర్యలు చేపట్టాలన్నారు. హోటళ్లలో అరిటాకులు, విస్తరాకులు, పేపర్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని పెంచాలన్నారు. ఈనెల15న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి నోడల్ అధికారిగా సీపీవో వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారు. సమావేశంలో డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, డీవీవో డి.శాంతలక్ష్మి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, మున్సిపల్ కమిషనర్లు, వీవీపీ నాయుడు, రవివర్మ పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

జియో టెక్స్‌టైల్ మ్యాట్ల వినియోగంపై అధ్యయనం చేయాలి: కలెక్టర్

కోనసీమ జిల్లాలో వరద కరకట్లు, రోడ్లు, డ్రైన్లు, పంటకాల్వ గట్లు బలోపేతానికి, దీర్ఘకాలిక మన్నికకు కొబ్బరిపీచు జియో టెక్స్‌టైల్ మ్యాట్‌ల వినియోగంపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలని వివిధ విభాగాల ఇంజనీర్లకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో శ్రీక్వాయర్ పరిశ్రమల కేంద్రం ప్రతినిధి త్రిమూర్తులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రోడ్ల నిర్మాణంలో శాస్త్రీయంగా లేయర్ల నిర్మాణం కోసం వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఇంజనీర్లకు అవగాహన పెంపొందించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో పైలెట్ ప్రాజెక్టుగా రోడ్ల నిర్మాణంలో సాంకేతికతను జోడిస్తూ రోడ్లు నిర్మించాలని సూచించారు. డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎంవీవీ కిశోర్, జలవనరులశాఖ ఈఈ బి.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ బి.రాము, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి, డీఈ అన్యం రాంబాబు పాల్గొన్నారు.

రేపు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

17నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు: జేసీ

అమలాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా అన్నిచర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి విద్య, పోలీసు అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై గురువారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. పరీక్షల సమయంలో చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరి మొబైల్ ఫోన్‌ను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. జిరాక్సు, నెట్ సెంటర్లన్నీ మూసి ఉంచేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సమస్యాత్మకంగా గుర్తించిన పసలపూడి, మొగలికుదురు, కొత్తపేట పరీక్షా కేంద్రాల్లోసీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 19,217మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారని, వీరికోసం 110పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు జేసీ తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, పదో తరగతి పరీక్షల కంట్రోలింగ్ అధికారి బీర హనుమంతరావు, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి

అమలాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు సర్వసన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి లైన్ డిపార్టుమెంట్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్ గౌడ్, మేనేజింగ్ డైరెక్టర్ జిలానీలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జేసీ పాల్గొన్నారు. అనంతరం లైన్ డిపార్టుమెంట్ అధికారులను ఉద్దేశించి జేసీ మాట్లాడారు. ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రతీ రైతుకు మేలు జరిగే విధంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎం.బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.ఉదయ భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, పౌరసరఫరాల సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, మార్కెటింగ్‌శాఖ ఏడీ కె.విశాలాక్షి, కార్మికశాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

అమలాపురం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసి విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి హాల్ టిక్కెట్‌న ఎచూపించి ఏవిధమైన బస్‌పాస్ లేకపోయినా కూడా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చునన్నారు. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం పొందవచ్చన్నారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ తెప్పోత్సవం

అంతర్వేది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మోరి మహాలక్ష్మమ్మ, కనమహాలక్ష్మమ్మవార్ల జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం తెప్పోత్సవాన్ని వైభవంగా జరిపారు. తొలుత ఆంజనేయస్వామి గుడి వద్ద మహిళలు నీళ్ల బిందెలతో పంటకాల్వలోని నీటిని తీసుకుని తెప్పోత్సవానికి బయలుదేరారు. మోరి గ్రామానికి చెందిన ఉంగరాల వెంకటపవన్‌సాయితేజ్-రమ్యసాయి దంపతులతో తెప్పోత్సవం వైభవంగా జరిగింది. భక్తులంతా తెప్పోత్సవం చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆధ్యాత్మిక దైవ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల శ్రద్ధ చూపాలి

మామిడికుదురు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సమగ్రశిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం సూచించారు. నగరంలోని ఇన్‌క్యూజివ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ సెంటర్ (ఐఈఆర్‌సీ)ని ఆయన గురువారం సందర్శించారు. రీసెర్చ్ సెంటర్‌లోని విద్యార్థులతో మమేకమై వారితో ముచ్చటించారు. కార్యక్రమంలో పీఆర్పీలు కె.సుశీల, ఎన్.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

రాజోలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాలతో జాతీయ రహదారి 216 పక్కన ఉన్న ప్రభుత్వస్థలాల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామని రాజోలు సెక్రటరీ ఎండీహెచ్ రెహ్మాన్ గురువారం తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో పంటకాల్వ పక్కన ఉన్న బోర్డులు, షెడ్లు, పాకలు, జేసీబీతో పోలీసుల సహాయంతో తొలగించామన్నారు.

పరీక్షల విజయవంతానికి సమష్టి కృషి అవసరం

ముమ్మిడివరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పది పబ్లిక్ పరీక్షలను సమర్థవంతంగా విజయవంతం చేయడంలో సమష్టి కృషి అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని విద్యాశాఖ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయ సంఘాలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో షేక్‌సలీంబాషా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను ఉపాధ్యాయుల సహకారంతో సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో కృషిచేస్తానని డీఈవో హామీఇచ్చారు. పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు మాట్లాడుతూ జిల్లాలో 19217మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, మార్చి13(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజబాబు సూచించారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఏపీ రెగ్యులేటరీ కమిషన్ స్టేట్ సలహా సభ్యులు ముత్యాల జమీలు అధ్యక్షతన రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. రాజబాబు మాట్లాడుతూ మండలంలో 275మంది రైతులు 2011లో డీఎస్ఎం నిబంధన పాటించకపోవడంతో ఉచితవిద్యుత్ సౌకర్యం పొందలేకపోయారన్నారు. రైతులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన డీఎస్ఎం చెల్లించి ఉచిత విద్యుత్ సౌకర్యం పొందాలన్నారు. కోనసీమ జిల్లాలో ఇప్పటివరకు 71వేల స్మార్ట్ మీటర్లు బిగించామన్నారు. అనంతరం ఎస్ఈ, డీఈ, జమీలను సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంతర్వేది, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి, రామేశ్వరం, గొంది, గుడిమూల, అంతర్వేదిపాలెం గ్రామాలకు ఉదయం7.30 నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఈఈ ఎస్.రాజబాబు, ఏఈ బి.ప్రసాద్ తెలిపారు. 12కేవీ సఖినేటిపల్లి ఫీడర్‌లో గల గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగిస్తామన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట సబ్‌స్టేషన్ పరిధిలోని వాకలగరువు ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ కె.రాంబాబు తెలిపారు. వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు, గన్నేపల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఓఎన్జీసీ తీరుపై గ్రామస్తులతో తహశీల్దార్ చర్చలు

అల్లవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామం పట్ల ఓఎన్జీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా టెర్మినల్ రోడ్డులో గ్రామస్తులు 11వ రోజు గురువారం రిలే దీక్షలు కొనసాగించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాలతో తహశీల్దార్ ఎంవీఎల్ నరసింహం, ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో చర్చలు జరిపారు. గ్రామ దత్తత, అభివృద్ధి, తీర ప్రాంత రక్షణ, స్థానిక యువతకు ప్లాంటులో ఉపాధి కల్పించాలని, సముద్రంలో ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల చేపల వేటకు అంతరాయం తదితర అంశాలపై గ్రామస్తులు తహశీల్దార్‌తో చర్చించారు. గ్రామస్తుల డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

వెంకన్న రథోత్సవం





యానాం,మార్చి13(ఆంధ్రజ్యోతి): యానాంభూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. అశేష జనవాహినితో యానాం రహదారులు కిక్కిరిసి పోయాయి. కశిరెడ్డి సత్యవీరవెంకన్న, కశిరెడ్డి వెంకటకృష్ణయ్య, యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణేశ్వరరావు ఉత్సవదారులుగా రథోత్సవం నిర్వహించారు. స్థానిక చిన్న సెంటర్ వద్ద స్వామివారి రథోత్సవాన్ని పరిపాలనాధికారి మునిస్వామి, ఈవో జ్యోతి వెంకటేశ్వరరావు సాయంత్రం 30అడుగుల ఎత్తుగల రథంలో వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత చిన్న రథంలో స్వామివారిని ఉంచి యానాం పురవీధుల్లో ఊరేగించారు. సీఐ షణ్ముగం గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

అమలాపురం రూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): భట్నవిల్లిలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అదేగ్రామానికి చెందిన పండు ధనరాజు(65), రెడ్డి నాగేశ్వరరావు(55) మోటారుసైకిల్‌పై స్థానిక ఐస్ ఫ్యాక్టరీవైపు తిరుగుతుండగా అదేసమయంలో రోళ్లపాలెం గ్రామానికి చెందిన లక్ష్మణరావు(25) మోటారుసైకిల్‌పై ఎదురువచ్చి ఢీకొట్టాడు. వృద్ధుడు ధనరాజుతో పాటు మిగిలిన ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా అమలాపురంఆసుపత్రికి తరలించారు.

ఇళ్లు నిర్మించుకునేందుకు అదనపు నిధులు

ముమ్మిడివరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం పట్టణ పరిధిలో తెలుపు రేషన్‌కార్డు కలిగి ఇళ్లు నిర్మించుకునేందుకు పీఎంఏవై అర్బన్ స్కీమ్‌లో రూ.లక్షా 80వేలు మంజూరు చేయబడి ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా అదనపు నిధులు మంజూరు చేస్తున్నట్లు కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. షెడ్యూల్డు కులాల వారికైతే రూ.50వేలు, షెడ్యూల్డు తెగలవారికైతే రూ.75వేలు, వెనుబడిన తరగతుల వారికైతే రూ.50వేలు అదనంగా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఇతర సమాచారం అవసరమైతే అసిస్టెంట్ ఇంజనీర్ ఫోన్ నంబరు 9533535899ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఒక సచివాలయానికి ఒక వీఆర్వో ఉండేలా చర్యలు తీసుకోవాలి

అమలాపురం రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు కలిపి ఒకే వీఆర్వోను మ్యాపింగ్ చేస్తున్న పరిస్థితుల్లో భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను గ్రామ రెవెన్యూ అధికారుల జిల్లా సంఘం తరపున రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా ఎస్.దివాకర్ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వివరించారు. ఒక సచివాలయానికి ఒక వీఆర్వో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్లస్టర్ విధానంలో కేడర్ స్ట్రెంత్ తగ్గకుండా చూడాలని కోరారు. వీఆర్వోల సంఘ జిల్లాశాఖ అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కమిటీ సభ్యుల బృందం కలెక్టర్‌ను కలిసి గ్రామ రెవెన్యూ అధికారులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఇతర శాఖల పనులు అప్పగించకుండా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌తో పాటు జాయింట్‌కలెక్టర్ టి.నిషాంతిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఇతర శాఖల పనులు అప్పగించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి: 24మంది అరెస్టు

యానాం,మార్చి 13(ఆంధ్రజ్యోతి): యానాంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. 24మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో రెండు రోజులుగా తిరుమల రిక్రియేషన్ క్లబ్‌లో పేకాట ఆడుతున్నారు. అయితే ఈక్లబ్‌కు సంబంధించిన పందెం రాయుళ్ల గోపాల్‌నగర్‌లోని గోకవరపు కాశి విశ్వనాధరావు(బన్ని) నివాసంలో పేకాట ఆడుతున్నట్టుపోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వహించి 24మంది పందెంరాయుళ్లను, రూ.లక్ష నగదు, కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వీరిని స్టేషన్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అల్లవరం ఎస్ఐగా తిరుమలరావు

అల్లవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అల్లవరం ఎస్ఐగా తిరుమలరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ హరీష్‌కుమార్‌ను వీఆర్‌కు పంపించారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు వెబ్ ఆప్షన్స్

అమలాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం జ్ఞానభూమి పోర్టల్, వెబ్ పోర్టల్‌లో వెబ్ ఆప్షన్ల సర్వీసు ప్రారంభించినట్టు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి పేర్కొన్నారు. ఉచిత కోచింగ్ కోసం అభ్యర్థుల షార్ట్ లిస్టు చేశామన్నారు. వెబ్ ఆప్షన్స్‌కు ఈనెల15వరకు గడువుఉందన్నారు. షార్ట్ లిస్టులోఉన్న వెయ్యిమంది అభ్యర్థులు ఇప్పటికే వెబ్ ఆప్షన్లను పూర్తి చేసుకున్నారన్నారు. మిగిలిన అభ్యర్థులంతా వెబ్‌ఆప్షన్లను 15వ తేదీలోపు పూర్తి చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్ ద్వారా ఎం ప్యానల్ చేయబడిన కోచింగ్ ఇనిస్టట్యూట్‌లకు తమ ప్రాధాన్యతలను ఎంపిక చేసుకోవాలన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో శుక్రవారం జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు క్రమశిక్షణతో వెళ్లి క్షేమంగా తిరిగి రావాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేలాదిగా తరలివచ్చి జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. శుక్రవారం ఉదయం 8గంటలకు అన్ని గ్రామాల్లో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించుకుని పి.గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేట మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పి.గన్నవరం తరలివస్తారన్నారు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించిన తరువాత ర్యాలీగా చిత్రాడ సభకు తరలివెళ్తామన్నారు. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి 53బస్సులు, 442కార్లలో పార్టీ శ్రేణులు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. ముమ్మిడివరం శ్రీశ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల ప్రాంతంలో భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. సభ తరువాత తిరిగి ప్రయాణంలో కాకినాడ-యానాం మధ్యలో మళ్లీ భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యకర్తలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

యునైటెడ్ జనసేన యూకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేనానితో సేన కార్యక్రమానికి హాజరైన జనసైనికులకు, వీరమహిళలకు ఎమ్మెల్యే సత్యనారాయణ అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి జనసేన ఆవిర్భావ వేడుకలు యూకేలో ఘనంగా జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ చేయాలి

అమలాపురం రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాల వారీగా ఎస్సీల వర్గీకరణతో మాదిగలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రం యూనిట్‌గానే ఎస్సీ వర్గీకరణ జరపాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సాకుర్రులో బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాప నాగభూషణం అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఎస్సీ వర్గీకరణ అధ్యయనం చేసేందుకు నియమించిన రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషనర్ ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించి జిల్లా యూనిట్‌గా వర్గీకరణ వర్తింపచేయాలని సూచించిందన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో మాదిగలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2000 సంవత్సరంలో జరిపినట్టుగానే రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ చేయాలని కోరారు.

ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీరు మళ్లింపు

అయినవిల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో సాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గురువారం గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి ఇబ్బందులు లేకుండా శివారు ప్రాంత భూములకు సైతం ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని మళ్లించే విధంగా చర్యలు తీసుకుని అమలు చేస్తున్నామన్నారు. ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. సోమిదేవరపాలెంలో ఆయన పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే జేసీబీ తో పంటకాల్వలో పూడికతీత, చెత్త తొలగింపు పనులు చేయించారు.

18వ రోజుకు చేరిన రిలే దీక్షలు

అమలాపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో డ్రైవర్ బీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి.

గ్రామస్తులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే దేవ


గొల్లపాలెంలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మలికిపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గొల్లపాలెంలో కేశనపల్లి జీజీఎస్‌లో విషపూరితమైన హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు లీకేజీతో అశ్వస్థతకు గురైన వారిని గురువారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరామర్శించారు. సంఘటన ఏవిధంగా జరిగిందో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ఓఎన్జీసీ నుంచి ఆర్థిక సహాయం అందేలా ప్రయత్నిస్తానన్నారు. అక్కడి నుంచి జీజీఎస్ వద్దకు వెళ్లి అధికారులతో సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. గుండుబోగుల పెదకాపు, ఎంపీపీలు ఎంపీవీ సత్యవాణి, కేతా శ్రీను, మట్టా అనంతలక్ష్మి, సర్పంచ్ నాగేశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాస్, దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.91లక్షలు



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అన ంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నా రు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,91,194 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఊబలంకకు చెందిన మేడపాటి అశ్విని‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు.

నేత్రపర్వంగా సాగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు

రావులపాలెం, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): రావులపాలెంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం నిర్వహించారు. వీటి ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి పర్యవేక్షించారు.



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు





వెండి కవచం అలంకరణలో మారెమ్మ అమ్మవారు. పక్క చిత్రంలో ఆలయం ఎదుట గరగ నృత్యాలు

వెంటూరులో ఘనంగా మారెమ్మ అమ్మవారి తీర్థం

రాయవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరు గ్రామస్తుల ఇలవేల్పు దండు మారెమ్మ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా జరిపారు. ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున అమ్మవారి జాతర, తీర్థం జరపడం ఆనవాయితీ. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారి ప్రతి రూపాలైన గరగలను గ్రామంలో గ్రామోత్సవం జరిపారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తీర్థాన్ని పురస్కరించుకుని అమ్మవారిని వెండి కవచంతో అలంకరించారు. వెంటూరు, చెల్లూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి, రామచంద్రపురం పరిసర ప్రాంతాల భక్తులు మారెమ్మ అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. రాయవరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జాతర నిర్వాహక కమిటీ సభ్యులు రిమ్మలపూడి దొరబాబు, ముత్యాల వీరబాబు, జి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఆలమూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే ప్రభుత్వ లక్ష్యంతో వివిధ కులాలకు 128 యూనిట్లు మంజూరు చేసి రూ.2.84 కోట్ల రుణాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానించామని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 50శాతం రాయితీపై రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఆయా వర్గాలకు సంబంధించిన దరఖాస్తులు ఈనెల 22లోపు అందించాలని ఎంపీడీవో రాజు కోరారు. దరఖాస్తుదారులు 21 నుంచి 60 సంవత్సరాల లోపు వారు ఉండాలని ముఖ్యంగా తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలని ఆయన తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు చర్యలు తీసుకోండి

అమలాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి జరిగే పదో తరగతి పరీక్షల అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. పరీక్షల సమయంలో చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరి మొబైల్‌ను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. జిరాక్సు, నెట్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇప్పటికే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను పర్యవేక్షణ కోసం నియమించామన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, పదో తరగతి పరీక్షల కంట్రోలింగ్ అధికారి బీర హనుమంతరావు, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం

అమలాపురం టౌన్(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. టెన్త్ విద్యార్థులు హాల్ టిక్కెట్‌ను చూపించి బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చునని ఆయన తెలిపారు.

రేపు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జూట్ సంచులు వినియోగాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులకు సూచించారు. ఈ నెల 15న మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహణపై గురువారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల విక్రయదారులను గుర్తించి విక్రయాలు నిలిపి చేయాలని, వాటి స్థానంలో డ్వాక్రా సంఘాలు చేసిన జూట్ బ్యాగులను విక్రయించేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జియో టెక్స్‌టైల్ మ్యాట్ల వినియోగంపై అధ్యయనం చేయాలి: కలెక్టర్

కోనసీమ జిల్లాలో వరద కరకట్టు, రోడ్లు, డ్రైన్లు, పంటకాల్వ గట్లు బలోపేతానికి, దీర్ఘకాలిక మన్నికకు కొబ్బరిపీచు జియో టెక్స్‌టైల్ మ్యాట్‌ల వినియోగంపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలని వివిధ విభాగాల ఇంజనీర్లకు కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో శ్రీక్వాయర్ పరిశ్రమల కేంద్రం ప్రతినిధి త్రిమూర్తులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రోడ్ల నిర్మాణంలో లేయర్ల నిర్మాణం కోసం వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఇంజనీర్లకు అవగాహన చేశారు. సమావేశంలో డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎంవీవీ కిశోర్, జలవనరులశాఖ ఈఈ బి.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ బి.రాము, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రమాణ స్వీకారం

ద్రాక్షారామ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. స్కౌట్స్ జిల్లా కోఆర్డినేటర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. పలువురు విద్యార్థులు స్కౌట్స్ అండ్స్ గైడ్స్‌లో ప్రవేశం పొందారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఐసీ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ జె.మల్లిబాబు, హెచ్ఎం పీఎస్‌బీఎస్‌కె సుందరి, ఇన్‌చార్జి హెచ్ఎం వీ.ఎస్.లక్ష్మి, స్కౌట్స్ మాస్టర్ ఎన్.సత్యనారాయణ, గైడ్స్ కెప్టెన్ వి.జయలక్ష్మి పాల్గొన్నారు.



పరేడ్ నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

మూత్రపిండాల వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

మండపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి) మూత్రపిండాల వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరానికి చెందిన మూత్ర పిండాల వ్యాధి నిపుణుడు డాక్టర్ డాక్టర్ కేవీ సుధాకర్ తెలిపారు. మండపేట పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మండపేటలో సంఘ అధ్యక్షుడు కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన మూత్ర పిండాల దినోత్సవాన్ని జరిపారు. దీనికి డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై మూత్ర పిండాల వ్యాధులు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ను పలువురు సత్కరించారు. కార్యక్రమంలో పీఎంపీ వైద్యులు రవికుమార్, కాశీ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.





కపిలేశ్వరపురంలో భారీ వాహనాలు తిరగకుండా అడ్డుపెట్టిన దృశ్యం. పక్క చిత్రంలో వంతెనకు, పిల్లర్‌కు మధ్య భాగం విడిపోయిన దృశ్యం

భారీ వాహనాలతో పెద్ద వంతెనకు బీటలు

• సమస్యను పరిష్కరించాలని గ్రామస్తుల వినతి • భారీ వాహనాలు వెళ్లకుండా అడ్డుగా పలు చర్యలు

కపిలేశ్వరపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో ప్రధాన పంట కాలువపై సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దవంతెన భారీవాహనాల రాకపోకలతో బీటలు వారింది. వంతెన అడుగు భాగం పలుచోట్ల దెబ్బతింది. సిమెంట్ దిమ్మలు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు వస్తున్నాయి. అడుగు భాగం పలు చోట్ల బీటలువారింది. దీంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. వంతెన ప్రమాదంగా మారడంతో పైనుంచి భారీ వాహనాలు తిరగకుండా గ్రామస్తులు పలు చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ అర్ధరాత్రి వేళల్లో వాటిని పక్కకునెట్టి భారీ వాహనాలు వంతెన పైనుంచి వెళ్లిపోతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి సమస్యను గ్రామ కార్యదర్శి శివచక్రవర్తి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాగా వారు పరిశీలించి వెళ్లినట్లు వారు తెలిపారు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణను వివరణ కోరగా ఇసుక వాహనాలు వంతెనపై నుంచి వెళ్లడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. వంతెన దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. వంతెన నిర్మాణానికి ఎస్టిమేట్స్ తయారు చేసి పంపుతున్నామని ఆయన తెలిపారు. ఇక్కడి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సోము వీర్రాజును కలిసిన బీజేపీ నేతలు

మండపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్సీగా ఎన్నికైన సోము వీర్రాజును మండపేట నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు కె.సత్యనారాయణ కె.మురళీకృష్ణ, వి.రవీంద్రబాబు, బార్గవ్, సాయిరాంచౌదరి, ముత్యం, మణికంఠ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ మండపేటే లక్ష్యం

కమిషనర్ రంగారావు

మండపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మండపేటకు ప్రజలంతా సహకరించాలని కమిషనర్ టీ.వీ.రంగారావు అన్నారు. మండపేటలో ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. గోడలకు అతికించిన పోస్టర్లను సిబ్బందితో తొలగించారు. దుకాణాల్లో తనిఖీలు జరిపి ప్లాస్టిక్ కవర్లను గుర్తించి ముగ్గురు దుకాణదారులకు రూ.1000 వంతున జరిమానా వేశారు. ఇంటి యజమానులు, వ్యాపారస్తులు చెల్లించాల్సిన పన్నులను వెంటనే చెల్లించాలని ప్రచార వాహనంలో సిబ్బంది కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ అయ్యప్ప నాయుడు

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కఠిన చర్యలు

ద్రాక్షారామ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను వినియోగిస్తే రూ. 5 వేలు జరిమానా విధిస్తామని కమిషనర్ అయ్యప్ప నాయుడు తెలిపారు. గురువారం రామచంద్రపురం పురపాలక సంఘం కార్యాలయంలో ప్లాస్టిక్ స్టాకు హోల్డర్లతో కమీషనర్ సమావేశం జరిపారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ స్టాకు హోల్డర్లు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

కె.గంగవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు రోజూ కృషి చేస్తామని పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ ప్రసాద్ అన్నారు. గురువారం వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కె.గంగవరం ఉన్నత పాఠశాలలో జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడు అద్దంకి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలకు ప్రసాద్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీవీ బ్రహ్మానందం, నందూరి భీమరాజు, జి.ఏడుకొండలు, పి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



హసన్‌బాదలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సతీష్‌రావు తదితరులు

తడి,పొడి చెత్త వేరు చేయాలని కరపత్రాల పంపిణీ

ద్రాక్షారామ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద పంచాయతీలో తడిపొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని అవగాహన కల్పిస్తూ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ అవగాహన కల్పించారు.

టిడ్కో రుణాలను రద్దుచేసి లబ్ధిదారులకు ఇవ్వాలి

అసెంబ్లీలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేట, మార్చి 13(ఆంధ్ర జ్యోతి): మండపేటలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాల నిర్మాణం 95 శాతం పూర్తి చేశామని, 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి పనులు చేపట్టక పోవ టం వల్ల నేటికీ అవి లబ్ధిదారులకు అంద లేదని గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా టిడ్కో గృహాల రుణాలను రద్దుచేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించి ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

ఆలమూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని రచించిన కవయిత్రి మొల్ల గొప్ప దర్శనికురాలని శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు మల్లవరపు మల్లేశ్వరరావు వ్యాఖ్యానించారు. శాలివాహన మండల సంఘం అధ్వర్యంలో గురువారం మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంటిపల్లి పాపారావు, వంటిపల్లి సతీష్‌కుమార్ తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మొల్ల జయంతిని నిర్వహించారు. మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలని నిర్ణయించిన నేపథ్యంలో దీన్ని నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి హెచ్ఎంతో పాటు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ప్రభావతి, రాంబాబు తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం: మాచర ఉన్నత పాఠశాలలో మొల్ల జయంతిని నిర్వహించిన దృశ్యం



ర్యాలి సాంగ్ ఆఫ్ జాయ్ పాఠశాలలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న జాతీయ సైన్సు ఎగ్జిబిషన్

ఆత్రేయపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ర్యాలి సాంగ్ ఆఫ్ జాయ్ పాఠశాలలో గురువారం జాతీయ సైన్సు ఎగ్జిబిషన్ 2025 నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు సైన్సు ప్రాజెక్టులు రూపొందించి ఆకట్టుకున్నారు. జాతీయ సైన్సు డేలో భాగంగా స్కూల్ యజమాన్యం దీన్ని నిర్వహించింది. విద్యార్థులు రూపొందించిన సైన్సు ప్రాజెక్టులను స్కూల్ డైరెక్టర్ పీఎస్ రెడ్డి జైపాల్ అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ప్రవీణ్, హెచ్ఎం గ్రేస్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే కూటమి ప్రభుత్వ పాలన

కె.గంగవరం, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): ప్రజల అభీష్టం మేరకే కూటమి ప్రభుత్వం పాలన చేస్తున్న దని కార్మికశాఖా మంత్రి సుభాష్ తండ్రి టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. మన గ్రామం - మన మంత్రిలో భాగంగా గురువారం బ్రహ్మపురి, మసకపల్లి, భట్లపాలిక, తాళ్లపోడు, పేకేరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, మంత్రి సుభాష్ శాసనసభ వ్యవహారాల్లో ఉన్నందున తాను ఈ సమావేశాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. జగనన్న కాలనీల్లో ఆక్రమణల నిగ్గుతేల్చాలని కూటమి నాయకులు రవ్వా భూషణం, కాటే సుబ్రహ్మణ్యం సభలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వాసంశెట్టి సత్యం

టెన్త్ విద్యార్థులకు పెన్నుల పంపిణీ

కపిలేశ్వరపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. శుక్రవారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో వీటిని అందజేసినట్లు తెలిపారు. అంగర జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తోరాటి శ్రీనివాస్, జనసైనికుడు సుధాతేజ, ఎస్ఎంసీ చైర్మెన్ గంగుమళ్ళ జానకిరాముడు, అద్దాల సాయి సౌజన్యంతో వీటిని విద్యార్థులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, జనసైనికులు పాల్గొన్నారు.

భవానీశంకర్ సేవలు చిరస్మరణీయం

ఆలమూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించిన పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్ సేవలు చిరస్మరణీయమని వక్తలన్నారు. పెదపళ్ల పీహెచ్‌సీలో సుదీర్ఘకాలం వైద్యసేవలు అందించి బదిలీపై రాజమహేంద్రవరం వెళ్లిన ఆయన్ను గురువారం నాయకులు, వైద్య సిబ్బంది సత్కరించారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచారని అఖిలపక్ష నాయకులు గారపాటి త్రిమూర్తులు, సలాది నాగేశ్వరరావు, సంగిత సుభాష్, తోట భవానీ వెంకటేశ్వర్లు, యేడిద మోహర్‌ప్రసాద్, నెక్కంటి సూర్యప్రకాశరావు, నల్లా వెంకన్న తదితరులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయి కిషోర్, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజు ఆక్కుల, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, పిఉమ తదితరులు పాల్గొన్నారు.



పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారిని సత్కరిస్తున్న దృశ్యం

నేడు విజయదుర్గా పీఠంలో ఫాల్గుణ పౌర్ణమి

రాయవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శుక్రవారం ఫాల్గుణ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. పీఠంలో ఉన్న భవానీ సమేత అష్ట లింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామికి తులసీ దళ అర్చనలు, నక్షత్ర నవగ్రహ హోమం జరుగుతాయన్నారు. అనంతరం మహిళలతో అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులు ఆయా పూజల్లో పాల్గొనాలని ఆయన తెలిపారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు చేసుకోండి

రాయవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వివిధ సామాజిక వర్గాల యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నదని రాయవరం ఎంపీడీవో ఎన్. కీర్తి స్పందన తెలిపారు. గురువారం రాయవరంలో ఎంపీడీవో మాట్లాడుతూ బీసీ, ఓసీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో ఈనెల 22లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ సామాజిక వర్గాల మహిళలకు ఉచిత కుట్టుశిక్షణకు దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నామని, 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సెంట్రల్ డెల్టాను ఆధునికీకరించాలి



ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గోదావరి సెంట్రల్ డెల్టాను దశలవారీగా ఆధునీకరించాల్సిన అవసరం ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సెంట్రల్ డెల్టా ద్వారా ఐదు నియోజకవర్గాల్లో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సర్‌ఆర్థర్ కాటన్ సమయంలో నిర్మించిన లొల్లలాకులు శిథిలావస్థకు చేరాయని వాటిని ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. గత వైసీపీ హయాంలో విద్యుత్ శాఖలో అవినీతిని పెంచి నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కొత్తపేట నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్య ఉందని త్వరగా దాన్ని పరిష్కరించాలని ఆయన కోరారు.

మహిళల ఆందోళనతో తరలిన మద్యం దుకాణం

మండపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండపేటలోని సత్యశ్రీ రోడ్డులో గురువారం ఏర్పాటు చేసే మద్యం దుకాణం ఏర్పాటును మహిళలు వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. వారి ఆందోళన నేపథ్యంలో వారం రోజుల్లో మరోచోటికి మారుస్తామని నిర్వాహకులు చెప్పినా మహిళలు ఒప్పుకోలేదు. మండపేట పోలీసులతోపాటు ఆలమూరు ఎక్సైజ్ పోలీసులు ఆందోళనకారులతో చర్చించినప్పటికి అవి ఫలించలేదు. చివరకు మద్యం దుకాణాన్ని వేరే చోటికి మార్చటంతో వివాదం ముగిసింది

'పెన్షన్ తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర'

మండపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పెన్షన్ ఏరివేసేందుకు ప్రభుత్వం కుట్రపన్నుతున్నదని శాసనమండలిలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వంలో పెన్షన్ల పంపిణీలో కులమతాలను చూడకుండా ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం 3లక్షల మందికి పెన్షన్లను రద్దుచేసే కుట్ర చేస్తున్నదన్నారు. రీ వెరిఫికేషన్ పేరిట వాటి తొలగింపు దారుణమన్నారు. గురువారం వైసీపీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆర్థికసాయం

ద్రాక్షారామ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న పేదకాపు యువతి వివాహం నిమిత్తం రూ 50 వేల ఆర్థికసాయాన్ని గురువారం అందచేశారు. యువతి వివాహం నిమిత్తం తోట పుండరీకాక్షులు అలియాస్ బాబి రూ.10 వేలు విలువ చేసే తాళిబొట్టు, చీర, మట్టెలు, కాపు ఐక్యత గ్రూపు తరపున రూ.25 వేలు, శుక్రవారపుపేట యువత తరఫున 15 వేలు అందచేశారు. కార్యక్రమంలో కాపు ఐక్యత గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.